క్లుప్తంగా

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 11 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేశారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 55, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 45, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 160.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఛేంజ్ యువర్ రేంజ్' అనే అంశంపై బి.కె.రవీంద్ర ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు. అనంతరం ప్రముఖ మెజీషియన్ స్వరంగ్ మ్యాజిక్ షో ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

మనూ'లో మీట్ ది ఆథర్

రాయదుర్గం: మనూలో యూనివర్సిటీ లిటరరీ క్లబ్ (యూఎల్‌సీ) ఆధ్వర్యంలో గురువారం 'మీట్ ది ఆథర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ జేఎన్‌యూ ప్రొఫెసర్ హరీష్ నారంగ్, 'మనూ' కల్చరల్ యాక్టివిటీ సెంటర్ చైర్మన్ సయ్యద్ ఇంతియాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు రచయితల గురించి అడిగిన పలు ప్రశ్నలకు వక్తలు సమాధానలిచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఐనుల్‌హసన్

రాయదుర్గం: అనువాదానికి భారతదేశం సరైన ప్రదేశమని జామియా మిలియా ఇస్లామియా ప్రొఫెసర్ అనిసుర్‌రహ్మాన్ గురువారం పేర్కొన్నారు. మనూ విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు సాగే అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భాషా, సాంస్కృతిక వైవిధ్యం కారణంగా భారతదేశం అనువాదం, తులనాత్మక అధ్యయనాలకు సరైన ప్రదేశంగా చెప్పవచ్చన్నారు. వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ మూలాధార సంస్కృతి యొక్క అనుభవాన్ని వివరించారు.అనంతరం హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ దొడ్డా శేషుబాబు 'మై దేఖ్ రహా హూన్' పేరిట అనువదించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పటాన్‌చెరు టౌన్: జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 9 వతరగతి విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని నిర్వాహకులు గురువారం తెలిపారు. బ్యాడ్మింటన్ మహిళల కేటగిరి డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, సింగిల్ రన్నర్ విభాగాల్లో సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో హన్సిక రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈనెల 29, 30 తేదీల్లో గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనుంది.

బేక్ లోర్‌లో మోడల్స్ సందడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని టాప్ మోడల్స్ గురువారం మాదాపూర్‌లోని బేక్ లోర్ వేదికగా సందడి చేశారు. ఈ సందర్భంగా వినూత్న రుచులను కోరుకునే నగరవాసుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన బేక్ లోర్‌లో టిరామీస్, విభిన్న రుచుల పిజ్జాలు, పేస్ట్రీస్ తదితర వెరైటీలు అందుబాటులో తీసుకువచ్చామని వ్యవస్థాపకులు మల్ల అలేఖ్య తెలిపారు. కార్యక్రమంలో సహ వ్యవస్థాపకులు యూసుఫ్, మల్ల విజయ ప్రసాద్, రాహుల్, మెహరీస్, రవీందర్, మల్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రాయదుర్గం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. రాయదుర్గం పోలీసుల కథనం ప్రకారం.. ఏప్రిల్ 11వ తేదీ రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద రోడ్డుపై కాలుకు తీవ్రగాయమైన మహిళ (60) పడి ఉందని ఫోన్‌లో సమాచారం అందుకున్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా బైక్ ఢీకొందని తెలుసుకుని ఆమెను 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 8 గంటలకు మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రధనుష్ సమ్మర్ క్యాంపు

- సీసీఆర్టీలో జూన్ 2వ తేదీ వరకు శిక్షణ తరగతులు
- చిన్నారులకు వివిధ అంశాలలో తర్ఫీదు



క్యాంపులో శిక్షణ పొందుతున్న చిన్నారులు





మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో చిన్నారులు తమ సత్తా చాటుతున్నారు. దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్)లో విద్యార్థుల కోసం ఇంద్రధనుష్ పేరిట సమ్మర్‌క్యాంపును నిర్వహిస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 6 నుండి 9వ తరగతి చదువుతున్న చిన్నారులు ఈ క్యాంపులో వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు. కళలు, సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనంపై అధ్యాపకులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

- ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిక్షణ ఉంటుంది.
- పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై , ఆప్లిక్యూ ఆర్ట్, పేపర్ క్రాఫ్టలతోపాటు కూచిపూడి డ్యాన్స్, ఫోక్‌డ్యాన్స్, మూమెంట్, మైమ్, ఫొటోగ్రఫీ, క్లాసికల్ పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు.
- ఈ నెల 23వ తేదీన ప్రారంభమైన తరగతులు జూన్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు.
- శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు.
- మట్టికుండల తయారీ ద్వారా మట్టి కుండలను ఏవిధంగా వాడేవారు. వాటి వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయనే అంశాలను అధ్యాపకుడు ముత్యాలు చిన్నారులకు వివరిస్తూ శిక్షణ ఇస్తున్నారు.
- క్రాఫ్ట్‌ను అధ్యాపకురాలు అరుణజ్యోతి సులభ పద్ధతిలో పిల్లలకు నేర్పిస్తున్నారు.
- టై అండ్ డై అధ్యాపకులు సత్యనారాయణ , సాంగ్స్ అంకిత తివారీ, స్టోరీ టెల్లింగ్ సుబ్బలక్ష్మి, డ్రామా డాక్టర్ రాజీవ్ రాజన్‌లు బోధిస్తున్నారు.

డ్రామా గురించి తెలుసుకుంటున్నాను



నేను మొదటిసారి గచ్చిబౌలి నుంచి వచ్చాను. డ్రామా నేర్చుకుంటున్నాను. 6వ తరగతి చదువుతున్నాను. డ్రామాకు ఉన్న ప్రాముఖ్యత, విషయాన్ని ఎలా తెలియపరచాలో మాస్టారు వివరించారు. చాలా అద్భుతంగా ఉంది. డ్రామాతో పాటు మిగతా అంశాలలో శిక్షణ తీసుకుంటున్నాను. మా ఇంట్లో డ్రామా అంటే చాలా ఇష్టం. నాటకాలు వేయడం ద్వారానే సినిమా రంగంలోని పలువురు ప్రముఖులకు స్థానం కలిగిందని వివరించారు.

–వేదాంత్, 6వ తరగతి

కుండలు తయారు చేయడం ఇష్టం



విద్యతో పాటు ఏదోఒక అంశంపై పట్టు సాధించాలన్నదే నా కోరిక. ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ క్యాంపులో పాల్గొనడం అంటే చాలా ఇష్టం. పాటలు పాడడం, కుండలు తయారు చేయడం అంటే చాలా ఇష్టం. నేను తయారు చేసిన కుండలను ఇంట్లో గుర్తుగా పెట్టుకుంటాను. అధ్యాపకులు సులభంగా తయారీ విధానాన్ని తెలుపుతున్నారు. ఫ్రెండ్స్‌తో కలసి నేర్చుకోవడం సరదాగా ఉంది.

–వైష్ణవి, 9వ తరగతి

పుస్తకాలకే పరిమితం కాకుండా..



విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించినప్పుడే వారి నైపుణ్యత బయటపడుతుంది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సంస్కృతి తెలుసుకోవడంతో బాటు సమాజానికి సేవ చేసే దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. సమాజంపై అవగాహన కల్పించాలి. సీసీఆర్టీలో ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ క్యాంపులో పాల్గొంటే పలు అంశాలను నేర్చుకోవచ్చు. సమ్మర్ క్యాంపులో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్‌లు 9063357895, 8886333799.

–సౌందర్య, ఫీల్డ్ ఆఫీసర్

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరుటౌన్: కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంగా పనిచేస్తూ బీజేపీని బలోపేతం చేస్తూ ముందుకెళ్లాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడ నుంచి వచ్చే వ్యర్థాలు, టిప్పర్ల రాకపోకలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి, మాజీ వార్డు సభ్యుడు జనార్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు నారాయణ దాసు, గోపాల్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

31న ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో 31వ తేదీ బుధవారం తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం షిర్డీసాయి బాబాకు హారతులు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఉదయం 5.30 గంటలకు బాబాకు కాగడహారతి, 6.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, 8 గంటలకు గణపతి, దత్తాత్రేయ స్వామి, షిర్డీసాయిబాబా వారికి పంచామృతాభిషేకం, మంగళ స్నానాలు,9.30 గంటలకు రుద్రహోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి,11 గంటలకు విష్ణు సహస్రనామ సహిత లక్ష్మీ అష్టోత్తర పారాయణం, సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు షిర్డీసాయిబాబాకు మధ్యాహ్నం హారతి, 1 గంటకు మహాఅన్న ప్రసాద వితరణ కార్యక్రమం, 4 గంటలకు బాబా వారికి పల్లకిసేవ, నగర సంకీర్తన, సాయంత్రం 6.15 గంటలకు సంధ్యాహారతి, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8.30 గంటలవరకు ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు శేజ్ హారతితో వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



పాపారాయుడునగర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీ, హనుమాన్‌నగర్, ప్రగతినగర్, పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్, పాపారాయుడునగర్ కాలనీల్లో రూ.406.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి బీఆర్‌యస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతామని తెలిపారు.పనుల్లో నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సాదం రామకృష్ణ, 237 ర్యాంకు ఇంజనీరింగ్



బోయఅనుదీప్ 1,579 ర్యాంకు ఇంజనీరింగ్



ఎం రంజిత్ 2,146 ర్యాంకు ఇంజనీరింగ్



సీహెచ్ నాగరాజు 3,501 ర్యాంకు ఇంజనీరింగ్



ఏ చేతన్‌కుమార్ 1,051 ర్యాంకు మెడిసిన్

రాయదుర్గం: ఎంసెట్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రిన్సిపల్ పాపారావు గురువారం ర్యాంకులను వివరించారు. సాదం రామకృష్ణ రాష్ట్ర స్థాయిలో 237వ ర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్ విభాగంలో బోయ అనుదీప్ 1,579 ర్యాంకు, మంజ రంజిత్ 2,146, చంద్రగిరి నాగరాజు 3,501 ర్యాంకులను సాధించారు. వర్కాల జశ్వంత్ 5,092, సంతోష్‌కుమార్ 6,072, ఎస్ శ్రీనివాస్ 6,294, పవన్‌చంద్ర 6,296, అభిలాష్‌కు 7,117 ర్యాంకు.అదేవిధంగా అగ్రికల్చర్, మెడిసిన్ క్యాటగిరిలో చేతన్‌కుమార్ అంబాల 1,051 ర్యాంకు, జైపాల్ రమావత్ 1,164, హర్షవర్ధన్ ముడావత్ 1,373, నితిన్‌జాడే 1,882, ద్రాక్షిత్ పెద్దలపల్లి 1,922, ప్రశాంత్ కుమార్ కావలి1,960, అభిమంత్‌సిస్లే 2,341, సాయితేజ లోవేకరే 2,948, శివశంకర్ అగ్రహారం 3,413 ర్యాంకును సాధించారు. టీచర్లు, విద్యార్థుల సమిష్టి కృషితో విజయం సాధించారన్నారు.

గురుకుల బాలికల కళాశాలలో..

'ఎంసెట్'లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు సత్తా చాటారు. ఎంసెట్ ఫలితాల వివరాలను గురువారం బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద వివరించారు. మెడిసిన్ విభాగంలో 107 మంది బాలికలు రాయగా అందులో 1000లోపు ర్యాంకులను 36 మంది సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 111 మంది రాయగా అందులో 9 మంది బాలికలు 1000లోపు ర్యాంకులు సాధించారు. మెడికల్ విభాగంలో జి సంధ్య 207వ ర్యాంకు, పి ఝాన్సి 384 ర్యాంకు, బి కీర్తన 685, ఎం నవ్యశ్రీ 775 ర్యాంకు, ఎస్ సన్నిహిత 847 ర్యాంకు సాధించారు.



జైపాల్ రమావత్ 1,164 ర్యాంకు మెడిసిన్



ఎం హర్షవర్ధన్ 1,373 ర్యాంకు మెడిసిన్



నితిన్‌జాడే 1,882 ర్యాంకు మెడిసిన్



పి ద్రాక్షిత్ 1,922 ర్యాంకు మెడిసిన్

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్–1 వాటర్ ట్యాంకర్ ఎదురుగా రూ. 20 లక్షల అంచనా వ్యయంతో, పాపమ్మ బస్తీ నుంచి చంద్రమ్మ కాలనీ వరకు రూ.12.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, వెంకట్‌నాయక్, బి.వెంకటేష్ గౌడ్, జనార్దన్, పోశెట్టి గౌడ్, వెంకటేష్, ఏఇ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

బొగ్గు పరిశ్రమకు సామాజిక, పర్యావరణ, భౌగోళిక సవాళ్లు ఉన్నాయి

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఆపరేషన్స్) డైరెక్టర్ ఎన్‌వీకే. శ్రీనివాస్



జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: దేశంలో బొగ్గు పరిశ్రమకు సామాజిక, పర్యావరణ, భౌగోళిక సవాళ్లు ఉన్నాయని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఆపరేషన్స్) డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో మైనింగ్ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం చాణక్య సెమినార్ హాల్‌లో 'కీ ట్రెండ్స్ ఇన్ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, ఎన్విరాన్‌మెంట్ ఇన్ మైనింగ్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో అన్ని సమస్యలను అధిగమించేందుకు సంస్థ చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సామాజిక అంచనాలను దృష్టిలో ఉంచుకొని సుస్థిరమైన మైనింగ్ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ శాస్త్రి మాట్లాడుతూ.. వనరుల భావనలకు వ్యర్థాల ప్రాముఖ్యత, పాడుబడిన గనులలో నీటి వనరులను సృష్టించడం, నిర్మాణ ప్రయోజనం కోసం వ్యర్థాల భారాన్ని ప్రాసెస్ చేసిన ఇసుకగా మార్చడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు మాట్లాడుతూ..గనుల మూసివేత ప్రణాళికలతో సహా మైనింగ్ కార్యకలాపాల సమయంలో, తరువాత పర్యావరణ ప్రభావాలను తగ్గించడానికి అన్ని చర్యలతో ప్రస్తుత జీవన ప్రమాణాలను కొనసాగిం డానికి మైనింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గీతమ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి రామశాస్త్రి, ఎస్కీ మైనింగ్ డివిజన్ సలహాదారు డాక్టర్ ఎంఎస్ వెంకటరామయ్య, ఎస్కీ మైనింగ్ డివిజన్ హెడ్ కేజేఅమర్‌నాథ్ ప్రసంగించారు.

జనాభా ఎక్కువ..కేంద్రాలు తక్కువ

- రోజురోజుకు పెరుగుతున్న కాలనీలు
- అధికమవుతున్న వలస కుటుంబాల సంఖ్య
- అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విన్నపం



ఖాజీపల్లి అంగన్‌వాడీ కేంద్రం

పటాన్‌చెరు: నియోజకవర్గపరిధిలో జనాభాకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోజురోజుకు పటాన్‌చెరు పట్టణం అభివృద్ధి చెందుతుండటంతో అన్ని గ్రామాలు పట్టణ ప్రాంతాలుగా మారి నూతన కాలనీలు ఏర్పడ్డాయి. గతంలో ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మిక కుటుంబాలు మాత్రమే వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ప్రస్తుతం బిహార్, ఛత్తీస్‌గఢ్ ఇలా అనేక ప్రాంతాల నుంచి వలస కూలీలు, మేస్త్రీలు నిర్మాణ రంగంలో పనిచేసేందుకు రావడంతో వారి కుటుంబాల సంఖ్య విపరీతంగా పెరిగింది. కొన్నిచోట్ల ఇప్పుడున్న జనాభాకే సేవలందుతాయని, కొత్తవారిని అంగన్‌వాడీ కేంద్రాలకు రానివ్వని పరిస్థితి నెలకొంది.

అదనంగా ఏర్పాటు చేయాలని విన్నపం

ఇదివరకు లక్డారం చౌరస్తాలో వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇటువంటి కేంద్రాలు మరిన్నింటిని ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరిగింది. అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ పట్టణాల్లో నూతనంగా వందలాది కాలనీలు పెరగడంతో ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఇప్పుడున్న అంగన్‌వాడీ కేంద్రాలకు రెండింతలు పెంచాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	:165
గర్భిణులు	: 2,353
బాలింతలు	:1,952
7నెలల నుంచి మూడేళ్ల పిల్లలు	: 12,403
ప్రీస్కూల్ (3–6) చిన్నారులు	: 4,974



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

“అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జనాభాకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో వలస కార్మిక కుటుంబాలకు పౌష్టికాహారం అందడంలేదు. దీంతో నా వార్డు పరిధిలోని టైలర్స్ కాలనీలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చాలాకాలంగా కోరుతున్నాం. ఇప్పుడున్న లింగమయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఈ ప్రాంతవాసులు వెళ్లాలని చెబుతుండటంతో అక్కడికి వెళ్లేందుకు బాలింతలు, గర్భిణులు ఇబ్బందిపడుతున్నారు.

– మున్నా, కౌన్సిలర్, అమీన్‌పూర్

“మినీ అంగన్‌వాడీల సంఖ్య పెరగాలి

అమీన్‌పూర్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటంతో నూతనంగా కాలనీలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి జనాభాకనుగుణంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– నాయిని నర్సింహారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

“ప్రతిపాదనలు పంపాం

పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తగా 34 కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపాం. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వివిధ కాలనీలవాసులు కోరుతున్నారు.

– చంద్రకళ, సీడీపీఓ, ఐసీడీఎస్, పటాన్‌చెరు ప్రాజెక్టు

శిల్పారామంలో కూచిపూడి వర్క్‌షాప్



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న కూచిపూడి నృత్యం వర్క్‌షాప్ శనివారంతో ముగియనుంది. పద్మభూషణ్ వెంపటి చినసత్యం కుమార్తె చావలి బాలత్రిపురసుందరి నిర్వహిస్తున్న వర్క్‌షాపులో దాదాపు ముప్పైమంది కళాకారులు పాల్గొన్నారు. శిబిరంలో తాళం, లయ, జతులు, అభినయం తదితరాలపై మెళకువలను నేర్పిస్తున్నారు.